క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో ఆంధ్ర నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్యాలయానికి చెందిన అంజలి, పూజిత, హేమ, రేష్మా, పూజ, భవ్యశ్రీ, శ్రావణిలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందచేశారు.

నేటి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆధునికీకరణ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ గుణదల విద్యుత్ ఉపకేంద్రం, డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ విద్యుత్ కేంద్రం ఆధునికీకరణ పనులు మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు జరుగుతాయని ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కేంద్రంలో ఆధునీకరణలో భాగంగా కొన్ని మార్పులు చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా 220 కేవీ గుణదల–డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ లైనులో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీని వల్ల సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం జరగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కానీ అత్యవసర పరిస్థితి ఉత్పన్నం అయితే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రపంచస్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీ నగరపాలక సంస్థ పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం నుంచి అమ్మ ఒడి ద్వారా ఆర్థిక బరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ శ్రీధర్ శ్రీనివాస్, సభ్యుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు రెండవ దఫా ట్యాబ్‌లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 62వ డివిజన్ కార్పొరేటర్ ఆలంపూరు విజయలక్ష్మీ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ట్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ట్యాబ్‌లను ఎలా వినియోగించాలనేది వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.మోహన్, విద్యా కమిటీ సభ్యులు శివకుమార్, యోహాను, పార్టీ నాయకులు రామిరెడ్డి, బోరా బుజ్జి, వేము హైమావతి, సుభాన్, బ్రహ్మేంద్ర, మహేష్, గంగాధర్, రాధా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు గ్రంథాలయాలు దిక్సూచి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఒక దిక్సూచిగా నిలుస్తున్నాయని చిత్తరంజన్ గ్రంథాలయ సంస్థ అధికారి పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. పోలీసు శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం పొందిన గ్రంథాలయ పాఠకురాలు బి.సోనియాను గ్రంథాలయ అధికారులు, పాఠకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, నిరుద్యోగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పోలీసుశాఖలో ఉద్యోగం సాధించిన సోనియా ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అంతా రామమయం



సీతారామపురం వేడుకల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



శ్రీరామ వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

- వెల్లివిరిసిన భక్తిభావం
- పలుచోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్య రామ మందిరంలో శ్రీ బాల రాముడి ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని సోమవారం నగరంలో భక్తి భావం వెల్లివిరిసింది. నగరంలోని పలు ప్రాంతాలు శ్రీరామ నామంతో మార్మోగాయి. నగరవాసులు ఇంటికి శ్రీరాముడి జెండాను ఏర్పాటు చేసి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుగుంటలోని సూర్య క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి శ్రీబాల రాముడి ప్రాణ ప్రతిష్టను వీక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ చల్లా హరి కుమార్ పాల్గొని శ్రీరాముడి గురించి వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే దావుబుచ్చయ్యకాలనీలో కాలనీ వాసులు శ్రీరాముడి జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్ విద్యార్థులు సీతారాములు, దేవతామూర్తుల వేషధారణలతో ర్యాలీ నిర్వహించి కోదండ రామాలయంలో పూజలు చేశారు. దేవీనగర్ కోదండ రామాలయం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి బాల రామ ప్రాణ ప్రతిష్టను ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే ముత్యాలంపాడులో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, డీ మురళీకృష్ణంరాజు, ఎన్ సాంబశివరావు శ్రీరాముడి వేషధారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

శ్రీరాముడి జీవితం ఆదర్శం

శ్రీరాముడి జీవితం అందరి జీవన గమనానికి తారకమంత్రమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అయోధ్యలో శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం దుర్గాపురం గౌతమ్ స్కూల్ అధినేత పీ చంద్రశేఖర్ ఆధ్వర్యాన సీతారాముల విగ్రహాలతో ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీతారాముల విగ్రహాలను చేతబూని విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ యుగయుగాలకు శ్రీరామచంద్రుడు ఆదర్శమని పేర్కొన్నారు. ఆ జగదభిరాముడి అడుగుజాడల్లో నడుస్తూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో చిన్నారులు శ్రీ సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారి వేషధారణతో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

మదర్ ఇండియా ఆటో ర్యాలీ..

పాయకాపురం(విజయవాడరూరల్): అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా మదర్ ఇండియా ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యాన ఆటో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్పొరేటర్ బీ జానారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రామ మందిరం వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీతారాంపురంలోని గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొర్తి శ్రీనివాస్ చక్రవర్తి ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా సెంట్రల్ వైఎస్సార్ సీపీ ఇంచార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా పల్లకీ సేవ, సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం సనాతన ధర్మ పరిరక్షణ కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సుమారు 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరాముడి శోభాయాత్ర...

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆధ్వర్యంలో సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డు నుంచి శివాజీ కేఫ్ వరకు శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని శ్రీరాముడిని పూజించారు. కార్యక్రమంలో కాశీవిశ్వేశ్వర దేవస్థానం చైర్మన్ కొల్లూరి రామకృష్ణ, పురోహిత సంఘం సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మధురానగర్ శ్రీకల్యాణ రామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. అలాగే దుర్గాపురంలోని కోదండ రామాలయంలో సీతమ్మ వారికి శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ అయ్యప్ప స్వామి మందిరం ఆధ్వర్యాన సారె సమర్పించారు. మధురానగర్ షిర్డీసాయిబాబా మందిరంలో బాల రాముడి ప్రాణప్రతిష్ట పురస్కరించుకుని దీపాలు వెలిగించి పూజలు చేశారు. పసుపుతోట శ్రీదత్త సాయి మందిరంలో సోమవారం దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని మందిరం వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.



సీతారాముల కల్యాణం



శ్రీ కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న చిన్నారులు

సాయిబాబా ఆలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయి బాబా–నాగమానస దేవి మందిరంలో బాబా భక్తులు రామ భజన–కీర్తనల కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని సామూహికంగా వీక్షించారు.

రామనామ భక్తి స్వరార్చన

విజయవాడ కల్చరల్: అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నగరానికి చెందిన సంగీత విద్వాంసులు భక్తి స్వరార్చన పేరుతో గవర్నరుపేటలోని సీతారామచంద్రమూర్తి దేవస్థానంలో సోమవారం సంగీత కార్యక్రమం నిర్వహించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ బృందం రామనామంతో తరిస్తూ సంకీర్తనలతో భక్తులను పులకింపజేశారు.

త్వరలో మెట్ల మార్గం నుంచి రాకపోకలు



సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఈఓ చంద్రశేఖర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ వాసులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న దుర్గగుడి మల్లికార్జునపేట మెట్ల మార్గంలో రాకపోకలు త్వరలో ప్రారంభం కానున్నాయి. మల్లికార్జునపేట ఉప్పరవాగు ప్రాంతం నుంచి అమ్మవారి ఆలయానికి మెట్ల మార్గం ఉంది. అయితే కొన్నేళ్లగా ఆలయ అధికారులు అమ్మవారి దేవస్థానానికి ఈశాన్యంలో ఉన్న ఈ మెట్ల మార్గాన్ని భద్రతా కారణాలు చూపి మూసివేశారు. దీంతో వన్‌టౌన్, కొత్తపేట, చిట్టినగర్, సాయిరాం ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారిని దర్శించుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దుర్గగుడి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి రాంబాబు ఈ మెట్ల మార్గాన్ని తిరిగి తెరవాలని ప్రతిపాదన చేశారు. దీంతో ఆలయ అధికారులు ఈ మెట్ల మార్గాన్ని తిరిగి తెరిచేందుకు అవసరమైన పనులు చేపట్టారు. గత రెండు రోజులుగా మెట్ల మార్గాన్ని శుభ్రం చేయించడంతో పాటు భక్తులు రాకపోకలు సాగించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. మెట్ల మార్గం వద్ద సెక్యూరిటీ సిబ్బందితో పాటు శానిటేషన్ సిబ్బందికి ఆలయ ఏఈఓ చంద్రశేఖర్ విధులు కేటాయించారు. సోమవారం మెట్ల వద్ద పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఇప్పటికే మెట్ల మార్గం ద్వారా భక్తుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో ఆలయ చైర్మన్, ఈఓలు ఈ మార్గాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

యువతకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు

కోల్ ఇండియా సంస్థ చైర్మన్ మల్లికార్జున ప్రసాద్



మల్లికార్జున ప్రసాద్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు అన్ని రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని కోల్ ఇండియా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోలవరపు మల్లికార్జున ప్రసాద్ (పీఎం.ప్రసాద్) అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సహజ వనరు బొగ్గు గనుల నిర్వహణ–ఉత్పాదన శక్తి అనే అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సోమవారం సదస్సు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ మన దేశంలో యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఎక్కడైనా ఉద్యోగాలు పొందవచ్చునని చెప్పారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇండియన్ రైల్వే సంస్థ తర్వాత పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నది కోల్ ఇండియా లిమిటెడ్‌లోనే అని చెప్పారు. తమ సంస్థలో రెండులక్షల 35 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 780 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారా పోటీ ప్రపంచంలో ముందంజ వేస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను తమ సంస్థ సాధిస్తుందని చెప్పారు. ప్రైవేటు రంగ సంస్థలకు కూడా ఈ బొగ్గు ఉత్పత్తిలో పాల్గొనే అవకాశాన్ని భారత ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా కోల్ ఇండియా సంస్థ తరపున దేశం వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలకు నిర్వహించామన్నారు. పర్యావరణ సమతుల్యత పాటిస్తూ ఉద్యోగుల భద్రత, సంక్షేమ కార్యక్రమాలకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లుగా వెల్లడించారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి. జంపాలా మాట్లాడుతూ ప్రసాద్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల ప్రాంతం అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆర్.సాంబిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ బి.జయప్రకాష్, డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎండీఎస్ రెహమాన్, డాక్టర్ జె.దుర్గాప్రసాద్‌లు కలిసి అతిథి ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు.

సెంట్రల్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కోరారు. సెంట్రల్ కార్పొరేటర్లతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఢిల్లీరావుతో వెలంపల్లి సమావేశమయ్యారు. సమావేశంలో కార్పొరేటర్లు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఓటీఎస్ పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, గుణదల ఆర్వోబీతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 22ఏ నుంచి తొలగించిన సర్వే నంబర్ల వివరాలను లబ్ధిదారులకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ రుహుల్లా, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు వైఎస్సార్ ఆసరా కొండంత అండ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో నాలుగో విడత ఆసరా ద్వారా 3,518 పొదుపు సంఘాల ఖాతాల్లో రూ. 32.12 కోట్లు జమ చేయనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తంగా నాలుగు విడతలలో 35,388 మందికి రూ. 125.85 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా సంఘాలు పూర్తిగా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు.

ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వహణలో ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య పట్టణంలో రామ్ లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సబ్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అత్యంత సుందరంగా నిర్మితమైన మహాద్భుత రామమందిరం కోట్లాది మంది హిందువుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. ఎవరినీ నొప్పించకుండా సామరస్య భావంతో మతాల మధ్య వివాదాలు లేకుండా శాంతియుత వాతావరణంలో రామ మందిరం నిర్మాణం పూర్తి కావడం దేశానికి శుభసూచికమన్నారు. హిందువులందరూ విశ్వసిస్తున్న రామజన్మభూమిలో బాల రాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట గావించడం దేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందన్నారు.

దేశం గర్వించదగ్గ నటుడు అక్కినేని

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశం గర్వించదగ్గ నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన సోమవారం అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు అక్కినేని సేవలను కొనియాడారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ మద్రాస్ నుంచి హైదరాబాద్‌కి సినీ పరిశ్రమ తరలిరావడానికి ఆద్యులు అక్కినేని అని తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అక్కినేని విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ కార్పొరేషన్ స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సొసైటీ సభ్యులు నాగమల్లిక, షఫీ, హేమంత్, రాజారావు, విశ్వేశ్వరరావు, వీరంకి గోవర్ధనేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు తక్షణ పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు రాగా అందులో ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంపై –5, టౌన్ ప్లానింగ్‌పై–12, రెవెన్యూపై–2, ప్రజారోగ్య విభాగంపై–1, ఎస్టేట్‌పై– 2 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల సంతృప్తే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమం



సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రతి గడపకు వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సోమవారం 64వ డివిజన్ 281వ సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటెయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అమ్మఒడి, చేయూత, ఇళ్ల స్థలాల పంపిణీ, వృద్ధులకు పెన్షన్ వంటి పథకాలు అందజేయడం జరుగుతోందని పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో 25 వేల ఓట్ల మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీకి ఎందుకు ఓటు వేయాలి..

టీడీపీకి ప్రజలు ఎందుకు ఓటెయ్యాలని వెలంపల్లి ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో నెలకు రూ. 400 కోట్లు పెన్షన్లు అందిచేస్తే, జగనన్న ప్రభుత్వ హయాంలో నెలకు రూ. 2 వేల కోట్ల పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. బొండా ఉమాను ముందు సీటు తెచ్చుకోవాలని చురకలు అంటించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ వెలంపల్లి శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం 64వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద దివ్యాంగులకు వెలంపల్లి చేతికర్రలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, బీ జానారెడ్డి, బాలి గోవిందు, పార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బందెల కిరణ్, ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక గౌస్‌మొహిద్దీన్, రాష్ట్ర జైన్ కార్పొరేషన్ చైర్మన్ కోఠారి మనోజ్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి పింగళి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి పింగళి వెంకటకృష్ణారావు అని సాహితీవేత్త గోళ్ళ నారాయణరావు అన్నారు. శ్రీ రామలింగా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విశ్రాంత అధ్యాపకుడు బహు గ్రంథకర్త పింగళి వెంకటకృష్ణారావు 60 సంవత్సరాల సాహితీ ప్రస్థానం, ఆయన రచించిన గౌతమ లహరి సాహిత్య వ్యాసాల ఆవిష్కరణ సభ, కవిపండిత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ వెంకట కృష్ణారావు సుదీర్ఘకాలం అధ్యాపకుడిగా పనిచేశారని తెలిపారు. విశ్రాంత ఆధ్యాపకుడు ఆయ్యలసోమయాజుల సాంబశివరావు పింగళి కృష్ణారావు సాహితీ సేవలను వివరించారు. సభలో పాల్గొన్న అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ పాల్గొన్నారు.









జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్

అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా బెజవాడ నగరంలో సోమవారం రామనామం మార్మోగింది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ అంటూ భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. రామమయం... జగమంతా రామమయం అంటూ గీతాలు ఆలపించారు. రామమందిర ప్రతిష్టను పురస్కరించుకొని వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ